క్లుప్తంగా

ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ సంఘం నాయకులు

సూర్యాపేట క్రైం : జిల్లా పోలీసు శాఖ మెరుగైన పనితీరును కనబరుస్తుడడంతో బుధవారం పోలీస్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రగౌడ్, ఏఓ సురేష్‌బాబు, ఇంటలిజెన్స్ ఏఎస్ఐ గాలి శ్రీనివాస్, చివ్వెంల ఏఎస్ఐ గునగంటి వెంకన్నగౌడ్, డీసీఆర్బీ ఏఎస్ఐ అంజన్‌రెడ్డి, భరోసా సెంటర్ ఏఎస్ఐ సైదాబి, సభ్యులు ఉన్నారు.

అన్ని రంగాల్లో పట్టణం అభివృద్ధి



మ్యాచ్‌లో పాల్గొన్న ఐఎంఏ, ఐడీఏ జట్లు

సూర్యాపేటటౌన్ : పట్టణం అన్ని రంగాలలో మంత్రి జగదీశ్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి చెందుతుందని, జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ గండూరి కృపాకర్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీకళాశాలలో ఐఎంఏ, ఐడీఏ సూర్యాపేట జట్ల మధ్య క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి కల్యాణ్, దిలీప్‌కుమార్, ఫణి, రమేష్‌చంద్ర, వెంకట్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, డాక్టర్ పూర రాంమూర్తి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పూల్‌సింగ్‌నాయక్



పూల్‌సింగ్‌నాయక్

అర్వపల్లి : తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన న్యాయవాది రమావత్ పూల్‌సింగ్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు కౌన్సిల్‌గా పనిచేయనున్నారు. ప్రజారక్షణ వ్యవస్థకు అనుగుణంగా కస్టడీలో ఉన్న నిందితులకు, క్రిమినల్ కేసుల్లో ప్రతివాదులకు ఉచిత న్యాయ సహాయం అందించనున్నారు. కాగా పూల్‌సింగ్‌నాయక్ ఇప్పటికే తుంగతుర్తి కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పూల్‌సింగ్‌నాయక్‌ను తోటి న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు తదితరులు అభినందించారు.

యువకులపై కేసు నమోదు

సూర్యాపేట క్రైం : పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్‌పై తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటింగ్ సిబ్బందితో పలువురు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సంతోష్, సందీప్, నాగు, శ్రీకాంత్ మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన బోటింగ్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి వారిపై చేయి చేసుకోవడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ సిబ్బంది పిడమర్తి ప్రసాద్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా మధునాయుడు



మధునాయుడు

పెన్‌పహాడ్ : మండల ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ ఇటీవల బదిలీపై నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి మండలానికి వెళ్లారు. దీంతో చివ్వెంల మండలంలో ఎస్ఐ-2గా విధులు నిర్వహిస్తున్న పి.మధునాయుడు మండల ఇన్‌చార్జ్ ఎస్ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణానికి చెందిన ఎస్‌కె.యాకూబ్‌అలీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి స్థానిక జెడ్పీ పాఠశాలలో 1984 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గబ్బెటి మణికుమార్, కందుకూరి కాంతయ్య, సోమయ్య, ఎల్లయ్య, అంజయ్య, అశోక్, సరస్వతి, రఘునాథ్, సత్యలత, శోభ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు వచ్చేదెప్పుడో?

- ఆరు నెలలుగా అందని మధ్యాహ్న భోజన కోడిగుడ్ల బిల్లులు
- మండలంలో రూ.13లక్షలకు పైగానే బకాయిలు
- అప్పులు చేసి వండిపెడుతున్న ఏజెన్సీలు



జాజిరెడ్డిగూడెంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

అర్వపల్లి : చదువులకు దూరంగా ఉంటున్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు పేద పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. అయితే మధ్యాహ్న భోజనాన్ని నిర్వహించే ఏజెన్సీ నిర్వాహకులకు నెల నెలా బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గతేడాది ఆరునెలల కోడిగుడ్ల బిల్లులు రావాల్సి ఉంది. దీంతో అప్పులు తెచ్చి విద్యార్థుల కడుపు నింపుతున్నారు. కాగా ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తమకు పెండింగ్‌లో ఉన్న గుడ్లబిల్లులు ఎప్పుడొస్తాయోనని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా రూ.2.23లక్షలు

జాజిరెడ్డిగూడెం మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 2,325 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే 32 మధ్యాహ్న భోజన ఏజెన్సీలుండగా 58మంది వర్కర్లు వంటలు చేస్తున్నారు. ప్రతినెలా కోడిగుడ్లకు బిల్లు మండల వ్యాప్తంగా రూ.2.23లక్షలు అవుతుంది. ఈ బిల్లు గతేడాది అక్టోబర్ నుంచి రావాల్సి ఉంది. కాగా నెలలో 12సార్లు కోడిగుడ్లు పిల్లలకు అందిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ఒక్క గుడ్డుకు ఏజెన్సీలకు రూ.5చొప్పున చెల్లిస్తుండగా బయట మార్కెట్‌లో రూ.7వరకు ధర ఉంది. దీంతో ఒక్క గుడ్డుకు రూ.2చొప్పున నష్ట పోవాల్సివస్తుందని, దీనికి తోడు గుడ్ల బిల్లులు 6నెలలుగా రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు రాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వస్తుందని, వాటికి వడ్డీలు పెరిగి తడిసి మోపెడవుతుందని ఏజెన్సీల మహిళలు వాపోతున్నారు. మండలంలో దాదాపు రూ.13లక్షలకు పైగానే బకాయిలు విడుదల కావాల్సిఉంది. వంట ఏజెన్సీల మహిళలకు ప్రస్తుతం రూ.1,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నారు. ఈ గౌరవ వేతనాన్ని ప్రభుత్వం రూ.3వేలకు పెంచి నాలుగు నెలలు దాటింది. అయినా పెంచిన గౌరవ వేతనం ఇప్పటికీ అమలు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెంచిన వేతనాన్ని త్వరితగతిన అమలు చేయాలని కోరుతున్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు 6నెలలుగా కోడిగుడ్ల బిల్లులు రావడంలేదు. ఈ బిల్లులు రాక, గుడ్ల ధరలు పెరిగి నిర్వాహకులు అప్పులపాలవుతున్నారు. పెరిగిన బిల్లులను వెంటనే విడుదల చేసి, రూ.3వేలకు పెంచిన గౌరవ వేతనాలను అమలు చేయాలి.

– పగడాల సరోజన, ఏజెన్సీ నిర్వాహకుల సంఘం మండల అధ్యక్షురాలు

నిధులు రాగానే జమ చేస్తాం



మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు మండలంలో కోడిగుడ్ల బిల్లులు 6నెలలవి రావాల్సి ఉంది. బిల్లులు చేసి పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు మంజూరి కాగానే ఏజెన్సీ మహిళల వ్యక్తి గత ఖాతాలకు జమ చేస్తాం.

– బి.బాలునాయక్, ఎంఈఓ

ప్రజల భద్రత, నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట క్రైం : పట్టణ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ నాగభూషణం అన్నారు. బుధవారం తెల్లవారుజామున పట్టణంలోని 18వ వార్డు సుందరయ్యనగర్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ నాగభూషణం, పట్టణ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధృవపత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు, మూడు ట్రాక్టర్‌లు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలపై పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సూచించారు. నేరాల నివారణ చర్యల్లో భాగంగా స్థానిక ప్రాంతాలలో ప్రజలు స్వచ్ఛందంగా కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ ఖాతా వివరాల కోసం వచ్చే కాల్స్, ఈ మెయిల్స్‌కు స్పందించొద్దన్నారు. బ్యాంక్ రేటు కంటే తక్కువ వడ్డీ రేటుకు లోన్స్ ఇస్తామంటే అనుమానించాలన్నారు. అనుమతి లేని ప్రైవేట్ చిట్స్‌ఫండ్స్‌లో చేరి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు యాట సైదులు, సతీష్‌వర్మ, ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్, ఏఎస్ఐ కుశలవ, శంకర్, 50మంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : మండలంలోని డి.కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన గంగదేవమ్మ ఆలయ అభివృద్ధికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం రూ.2లక్షలను విరాళంగా తన వ్యక్తిగత సహాయకుడు సైదులు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ అధ్యక్షుడు దోనకొండ రమేష్, పుసుపులేటి వెంకట్‌రెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మల్లేష్, నరేష్, చంద్రశేఖర్, లింగయ్య, చంద్రయ్య, బయ్యన్న, రవి పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

తుంగతుర్తి : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభంకావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని గొట్టిపర్తి, వెంపటి, అన్నారం గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే సర్వసభ్య సమావేశానికి హాజరు కానీ శాఖల అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ భీంసింగ్, వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పెన్షన్‌దారుల సంయుక్త సంఘం, టాప్రా సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సోమయ్య, పెన్షనర్స్ జేఏసీ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.యాదయ్య అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట పెన్షనర్‌లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలన్నారు. ప్రతి జిల్లాలో కనీసం రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్లు, మందులు, పరీక్షల సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కోరారు. పెన్షనర్లకు బకాయి ఉన్న రెండు కరువు భత్యాల వాయిదాలు వెంటనే విడుదల చేయాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే వచ్చే నెల 12న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ఎదుట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం నాయకులు బెడిద సోమయ్య, మల్లు వెంకట్రాంరెడ్డి, ముత్తినేని నారాయణ, మన్నె యాదగిరి, గడ్డం వెంకట్‌రెడ్డి, జి.భిక్షపతి, డి.రాములు, దాసరి వెంకన్నయాదవ్, హసన్‌అలీ, వై.అంజయ్య, ఆర్.కృష్ణయ్య, సత్తయ్య, సత్యనారాయణ, శేఖర్, భూషణ్, శివరామయ్య, జానకిరాములు, రాందాస్ పాల్గొన్నారు.

1న సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో జూలై 1న సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర జిల్లా పార్టీ నిర్ణయాలను చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ముఖ్య నాయకులు చామల అశోక్, రేగటి లింగయ్య, దికొండ శ్రీనివాస్, గాలి కృష్ణ, మైనార్టీ నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



నాగారంలో మాట్లాడుతున్న కడియం కుమార్

నాగారం : ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను అధికారులతో సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల ఇస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా నేటికి ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట గూడపూరి వెంకటేశ్వర్లు, తీగల వెంకన్న, భిక్షం, అంజమ్మ, రాములు, వెంకన్న, పద్మ, యదమ్మ, రమేష్ ఉన్నారు.

అర్వపల్లి : ఇటీవల కురిసిన అకాల, వడగళ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 22, 23తేదీల్లో మండలంలో కురిసిన వర్షాలకు 6వేల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించినప్పటికి ఇంతవరకు పైసా ఇవ్వలేదని అన్నారు. నష్టపరిహారం చెల్లించి రైతులకు రుణమాఫీని అమలు చేయాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మద్దిరాలలో నోట్ పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న నోట్ పుస్తకాలను మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో బుధవారం సర్పంచ్ ఇంతియాజ్‌ఖాతూన్‌రజాక్, మండల పరిధిలోని చిన్ననెమిల ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం శివయ్య వేర్వేరుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చదువుకోవాలని, అధిక ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలలకు పంపి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమావత్ రమేష్, ఎస్ఎంసీ చైర్మన్లు మట్టిపెల్లి శ్రీను, వెంకన్న, సీఆర్పీ కాటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలి



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



మద్దిరాల : మాట్లాడుతున్న ఎస్ఏ.రజాక్

నూతనకల్ : తిరుమలగిరి మండల కేంద్రంలో నేడు (గురువారం) నిర్వహించే ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రగతి నివేదన సభకు తరలిరావాలని నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌ను మూడోసారి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, సురేందర్‌నాయక్, సజ్జనాయక్, శంకర్ నాయక్, నర్సింహ, విద్యాసాగర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలో నేడు నిర్వహించే తుంగతుర్తి ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని తిరుమలగిరి మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ చాగంటి అనసూయ రాములు, జలాల్‌పురంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తెడ్డు భాస్కర్ కోరారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు బుధవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. వారి వెంట బాబు, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : తిరుమలగిరి మండల కేంద్రంలో నేడు నిర్వహించనున్న తుంగతుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మంత్రి కేటీఆర్ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట గుండగాని అంబయ్యగౌడ్, యారాల రాంరెడ్డి, బాలమల్లు, రమేష్, ముకుందారెడ్డి, నర్సింహారెడ్డి, వెంకన్న ఉన్నారు.

మద్దిరాల : నేడు తిరుమలగిరిలో జరిగే ప్రగతి నివేదన సభకు మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రంథాలయ కమిటీ జిల్లా డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లు కపోత్తంరెడ్డి, కన్న వీరన్నగౌడ్, గుడ్ల వెంకన్న, కోడి శ్రీనివాస్, మధుసూదన్, కళింగారెడ్డి, లింగారెడ్డి, తిర్మల్‌రావు, వెంకన్న, అమృతరెడ్డి, వెంకన్న, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : తిరుమలగిరిలో నేడు నిర్వహించే ప్రగతి నివేదన సభకు పార్టీశ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల నాయకులకు జెండాలు, బ్యాడ్జీలు, ఇతర సభ సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సభను విజయవంతం చేయాలన్నారు.

తిమ్మాపురంలో..

తిరుమలగిరిలో నేడు జరిగే సభను విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రామంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. సమాశేంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం



ఇంటింటికి ప్రచారం చేస్తున్న నాయకులు

అర్వపల్లి : ప్రధాని మోదీ పాలనలో ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని బీజేపీ మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్ తెలిపారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌లో బుధవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా నిలవడంతో పాటు సురక్షంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కూర శంకర్, జిన్నె అశ్విన్, చవ్వ సురేష్, వేముల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో పాలకులు విఫలం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపాలిటీలోని ప్రజలకు మంచినీటి సరఫరా చేయడంలో పాలకులు, మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పట్టణ 30వవార్డ్ కౌన్సిలర్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పల్స మహాలక్ష్మి మల్సూర్‌గౌడ్ విమర్శించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు రోజులుగా పట్టణంలో నీటి సరఫరా లేక ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పట్టణంలోని నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్కు అందజేత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మల్లయ్య కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో బుధవారం సూర్యాపేట జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుకుట్ల లాలు ఆధ్వర్యంలో అతడి కుటుంబానికి రూ.10వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్దాసు సైదులు, ప్రధాన కార్యదర్శి రజినిబాయి పటేల్, కోశాధికారి అన్నదేవర సత్యం, నర్సయ్య, కృష్ణ పాల్గొన్నారు.

వ్యాపారులకు దుకాణాలు కేటాయించాలి



కాల్‌రాంను సన్మానిస్తున్న కూరగాయల వ్యాపారులు

భానుపురి (సూర్యాపేట) : నూతనంగా నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులందరికీ ఒకే దగ్గర దుకాణాలు కేటాయించాలని విశ్వనాథస్వామి గంజ్ కూరగాయల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు గుగులోతు కాల్‌రాం అన్నారు. బుధవారం పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో సరైన సదుపాయాలు లేక రోడ్లవెంట 400మంది వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడి నుంచే జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కూరగాయలను ఎగుమతి చేస్తున్నామని, అయినా శాశ్వత భవనాలు లేకపోవడంతో అక్కడికి.. ఇక్కడికి వెళ్లి వ్యాపారం చేసుకోవాల్సింది వస్తుందన్నారు. వానాకాలం కావడంతో రోడ్లపై వ్యాపారం చేసుకోవడానికి చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సూర్యాపేటలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మాంసం, చేపలు కాకుండా కేవలం కూరగాయల విక్రయానికే దుకాణాలు కేటాయించేలా మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు. ఇందులో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఇటీవల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాల్‌రాంను వ్యాపారులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో వ్యాపారస్తుల సంఘం గౌరవ అధ్యక్షురాలు బంగారమ్మ, నాయకులు వెలుగు వెంకన్న, లలిత, అబ్బాస్, రెడ్యానాయక్, సయ్యద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయాలి



ఆత్మకూరు (ఎస్) : కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నూతనకల్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు అల్లుబెల్లి వెంకటనర్సయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. జూలై 3న ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్‌లో నిర్వహించే సభకు ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు కునుకుంట్ల సైదులు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దేసోజు మధు, సామ నర్సిరెడ్డి, వీరబోయిన రమేష్, మల్లయ్య, గడ్డం పాపయ్య, ఉప్పలయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో జూలై 3న నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, రైతు కూలి సంఘం వ్యవస్థాపక సభ్యుడు, న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు అలుగుబెల్లి వెంకటనరసయ్య ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. బుధవారం గ్రామంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, వీరబోయిన రమేష్, గ్రామ ఉపసర్పంచ్ కళ్లంచర్ల చంద్రయ్య, పీవైఎల్ మండల ప్రధాన కార్యదర్శి కల్లంచర్ల శ్రీను, సహాయ కార్యదర్శి పోతురాజు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట క్రైం : పోలీసు భరోసా సెంటర్ సూర్యాపేటలో పనిచేసేందుకు సర్వీస్ రెగ్యులరైజేషన్ హక్కులు లేకుండా కాంట్రాక్టు ప్రాతిపదికన తగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సూర్యాపేట భరోసా సెంటర్ కో ఆర్డినేటర్‌గా ఉద్యోగ నియామకాలు సంవత్సరం కాల వ్యవధి కొరకు మాత్రమేనన్నారు. అదే కాలవ్యవధిలో అవశ్యకత, బడ్జెట్ ప్రకారం ప్రతి సంవత్సరం పొడిగించడుతుందన్నారు. నియామకం మొత్తం డి బిజినెస్ సొల్యూషన్స్ ఏజెన్సీ ద్వారా జరుతుందన్నారు. బయోడేటా, ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్స్ అడిగిన పత్రాలు అన్ని ఈ మెయిల్ ఐడీ **dbusinessolutionzz@gmail.com** ద్వారా, లేదా వాట్సాప్ 9014052175 పంపాలని తెలిపారు. వచ్చే నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హత ఎంఎస్సీ, ఎంఏ పీజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ రెండు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. వయస్సు 35–45 సంవత్సరాలు ఉండాలని, జీతం రూ. 23000లు ఇవ్వనున్నట్లు తెలిపారు.